
# సినీ బేతాళ కథలు





## – డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 18 -

### - అంతా మన మంచుకే! -

**విక్రమార్కుడు, బేతాళుడి** శవాన్ని మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'నీకు శ్రమ కలగకుండా వుండేందుకు మళ్లీ మరో కథ చెబుతాను విను విక్రమార్కా!' అని బేతాళుడు ప్రారంభించాడు.

"తియ్యగా తియ్యగా తెలుగు సినిమాల్లో కళావర్ రాణి అనే నటి తీయగా, తీయగా కనిపించసాగింది. ఆమె పేరు కళావర్ రాణి అయినా ఆమె ప్రేక్షక హృదయాల్ని దోచుకునే అరకు రాణి అయిపోయింది. ఆమె నటి జీవితం పేకమేడలా శిఖరించింది. అరకు రాణి నటప్రాభవాన్ని చెరుకు రసంలా గ్రోలారు తెలుగాడియన్సు. కేవలం తెలుగు దేశంలోని తెలుగులేకాదు, తెల్లదేశాల్లో వున్న లెక్కకు మించిన తెలుగూస్‌కి కూడా అరకు రాణి అభిమాన రాణి అయిపోయింది.

లండన్‌లో తెలుగు అసోషియేషన్ వారు ఆమెను సత్కరించాలనుకున్నారు. ఆమెను ఆహ్వానించారు. వారి ఆహ్వానాన్ని మన్నించి అరకు రాణి అలాగే అంటూ విమానంలో విహంగించి లండన్‌లో దిగింది. లండన్‌లోని తెలుగు ప్రముఖులు అరకు రాణికి వణుకుతూ నమస్కారాలు చేశారు.

'ఎందుకలా వణుకుతారు? నేను కేవలం మీలాంటి మనిషినే - ఏదో ఆ పరమేశ్వరుడి దయవల్ల స్టార్‌నయ్యాను. ఏం భయంలేదు. వణక్కండి' అంది అరకమ్మ.

'అమ్మా! మాకే భయంలేదు. ఇక్కడ మాకు బాగా చలెక్కువ. అంచేత వణుకొచ్చింది' అన్నారు కొందరు.

'మీరొస్తున్నారని ఎక్సైటయిపోయి, నిన్నరాత్రి కాస్త స్కాచి ఎక్కువ బిగించడం వల్ల యీ వుదయం టాప్‌అప్ లేకపోవడం వల్ల వణుకొచ్చింది. మాకు ఆనందమేగాని భయంలేదు' అన్నారు మరికొందరు.

'తెల్లారకట్టే స్కాచి వడబోస్తున్న మీ అభిమానానికి నాకేదో కిక్కొచ్చేస్తున్నాది. నా లవ్లీ తెలుగోరా!' అని అరకురాణి తన హర్షం ప్రకటించింది.

కాసేపు లండన్ తెలుగు ప్రముఖులు, ఆమెను మా యింటికి తీసుకువెళ్తామంటే, మా యింటికి తీసుకెళ్తామని వాదించుకున్నాక ససేమిరా అని ఆ తెలుగు అసోషియేషన్ ప్రెసిడెంటు వుబలాటంగారు వారింటికి తీసుకువెళ్ళారు. వుబలాటంగారింటికి వెళ్లాక, అరకురాణి 'మీ దేశంలో సలెక్కువని శానా బట్టలు కట్టేసి కప్పేసుకున్నాను. యియన్నీ శానా సిరాగ్గున్నయ్. అయినా నాలాంటి పేమసు వీరోయిన్‌కి యిలా వొల్లు కప్పుకుంటే గెలామరు యీకయిపోద్ది. అంచాత యీ పైయన్నీ యిప్పేస్తాను' అంది.

'నా మనసులో మాట మీరు చెప్పేసారు. విప్పేయండమ్మా! విప్పేయండి. నికార్సయిన నీటు స్కాచి వో రెండు గుండ్రాలిచ్చి చలెకుండా మీ వొంట్లో నిప్పులు వెలిగిస్తాను' అన్నారు వుబలాటంగారు.

తెలుగు కెమెరాకి అడ్డం వచ్చే వస్త్రాలన్నీ తొలగించుకుని, స్కాచితో వెచ్చబడింది అరకురాణి.

'లండన్ రాటం – నాకిదే ఫస్టు. ఇలా పతీ యేడూ పిలుస్తారా?' అనడిగింది.

'అవునమ్మా – అరకు రాణిగారూ! అవును. ఏటా ఒక సెల్రబెటీని ఆహ్వానిస్తాం. ఇక్కడ తెలుగువారందరినీ పిలిచి, ఆహ్వానించిన గెస్టుకి బిరుదిచ్చి సన్మానం చేస్తాం. అయితే క్రితం ఏడాది మాత్రం చిన్నపొరపాటు జరిగింది.'

'ఏటా పొరబాటు?'

'పెద్దగా ఏం లేదమ్మా! లాస్టియర్ చలి బాగా యెక్కువగా వుంది. శ్రీ యస్పీ బాలసుబ్రమణ్యంగార్ని పిలిచాం. వారు మంచి పాటలు కూడా పాడారు. అయితే అప్పుడు యిక్కడ చలి బాగా యెక్కువ వుండడం వల్ల, ఆ చలికి పాడుతున్నప్పుడు వారికి కాసిని సంగతులు యెక్కువ పడ్డాయి. దాంతో అంతా ఆయన్ని శ్రీ మంగళంపల్లి బాల మురళీకృష్ణగారనుకున్నారు. అంచేత శ్రీ యస్పీగార్ని మరోసారి మంచి యెండగా వున్నప్పుడు పిలుద్దామనుకుంటున్నాం.' అన్నారు వుబలాటం.

'నా స్టోను స్టోన్‌లాంటిది. అసలొణకదు. ఈ స్కాచితో యింకా స్టెడీ అయిపోద్ది. నాతో మీకా కనుపూసనుండదు.'

'బలే చెప్పారు. అంతా మీ అందాన్ని చూస్తూ మైకంలో పడిపోతారు. మీకు స్టేజ్ మీద డబ్బింగు పెట్టినా వాళ్లకి తెలిసి సావదు.'

'యింకో రౌండెట్టండి. యెంతో యేపీగా వుంది. అయినా మనెదవలకి బాడీసేపు మీదే కన్ను, నా వేక్సన్, నే సెప్పే రైటరోడి బూతులనే సోడా, అయిసుల్లోంటివి. మీరేసుకోరా?'

'నేనిందాకే వేసేసుకున్నాను. యింకోటేస్తే యింకోటేవన్నా చేస్తానేమోనని డౌటు. అయినా అరకురాణిగారు మీరు ఎంకరేజ్‌మెంట్ యిచ్చారు కనుక కాదన్లేను' అని వుబలాటంగారు కూడా మరో పెద్ద గుండ్రం పీకారు.

'వుబలాటంగారూ! మీకు వుబలాటవేకాదు – వూపు కూడా యెక్కువే' అంది అరకురాణి.

'ఏదో మీ ఆశీర్వాదం' అని వుబలాటం మరో పాటియాల పెగ్గు పీకాడు.

లండన్ తెలుగు అసోషియన్ వారి సభ ఘనంగా జరిగింది. అరకు రాణి దర్శనానికి అంతా హారతులిచ్చారు. అరకు రాణికి అఖండ నటీమణి అని బిరుదిచ్చి సత్కరించారు. ఆమె ఆనందం అవధులు దాటింది. తర్వాత లండన్లో మరికొన్ని తెలుసు అసోషియేషన్స్ యింకొన్ని సమావేశాలకు ఆమెను ఆహ్వానించి సత్కరించారు.

హీత్రో ఎయిర్ పోర్ట్‌కి వెళ్లేటపుడు వుబలాటంగారి ద్వారా లండన్‌లో యెంతమంది తెలుగువారున్నారో, యెన్ని తెలుగు అసోషియేషన్స్ వున్నాయో వుజ్జాయింపుగా తెలుసుకుంది.

అరకురాణి, యిండియాలో కాలుపెట్టగానే ఎన్నో టివి ఛానల్సు ఆమెను యింటర్వ్యూ చేశాయి.

'లండన్‌లో యేంట మండి టెల్గూస్ వుంటరంటర్?' అని వొక యాంకర్ పిల్ల అడిగింది.

'ఓ – శానా! శానా! నాకు తెలిసిన లెక్కలో యిరువయ్యేల మందుంటారు.' అని బదులిచ్చింది అఖండ అరకు రాణి.

'మీరు ఆమెనీ అస్వోసన్స్ ఎడ్రసూ, చేషినార్?' మళ్లీ యాంకర్ పిల్ల అసలు సిసలు తెలుగులో అడిగింది.

'నానా? నాను - యిరవయ్యేల పలస్సు వొక - అంటే యిరవయ్యేల వొక్క తెలుగు సంగాల్ని నా పసంగాల్తో పరవానందంలో మునగదీసాను.' అని జవాబిచ్చింది అరకు రాణి.

- అదీ విక్రమార్కా! యిప్పుడు చెప్పు. ఆ యాంకర్ పిల్లకి అరకు రాణి యిచ్చిన సమాధానం కరెక్టేనా? లండన్‌లో యిరవై వేలమంది తెలుగువారుండగా అరకురాణి యిరవై వేల ప్లస్ ఒకటి తెలుగు అసోసియేషన్స్‌ను యెలా ఎడ్రస్ చేసింది. అసలు లండన్‌లో తెలుగువారు అరకురాణి సేకరించిన లెక్కప్రకారం యిరవై వేలమంది వుంటే, ఆమె యిరవై వేల వొక్క తెలుగు సంఘాల్ని ఎలా పలకరించింది? ఆమె చెప్పింది నిజమేనా?

- "ఈ ప్రశ్నకు నువ్వు 'విశదీకరించే జవాబు' తెలిసీ చెప్పకపోయావో, నీ తల లండన్ తెలుగు అసోషియేషన్స్‌లా, యిరవై వేల వొక చెక్కలయిపోతుంది" - అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు -

"ఓ బేతాళా! - వెరీ సింపుల్ ఆన్సర్! లండన్‌లో యిరవై వేలమంది తెలుగువారుంటే - అంతా కలిసి పెట్టుకున్న తెలుగు అసోషియేషన్ - ఒకటి - ఎవరికి వారు పెట్టుకున్న తెలుగు అసోషియేషన్స్ యిరవై వేలు - వెరసి యిరవై వేల వొకటి. ఈ విషయంలో అమెరికాకి, లండన్‌కీ ఏవీ తేడాలేదు. లండన్ తెలుగు అసోషియేషన్స్‌లన్నీ చలికి తోడుకున్న ఐసు ముక్కలు. అన్నీ కలిస్తే అమ్మకడుపులా వొకటే చల్లని నీరు.

- 'సుహృన్మిత్రార్యుదాసీన మధ్య స్థద్వేష్య బంధుషు!

సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే'

ఆత్మలలో తేడాలు లేవు, అంతరంగాలలోనే - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు -"

- అని సమాధానం చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు - నేను కూడా వెంటనే నా కొమ్మ మీద వొక అసోషియేషన్ పెట్టుకుంటాను - అని యెగిరి వెళ్లి చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments